

గరుడ టికెట్‌తో శీఘ్ర దర్శనం
యాదగిరిగుట్ట క్షేత్రంలో గరుడ టికెట్ అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. - 8లో



రూ.20కే రూ.2 లక్షల బీమా
ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద ఏడాదికి ప్రీమియం రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల బీమా పొందవచ్చు. - 8లో



ఇన్‌చార్జ్ బాధ్యతలు మాకొద్దు
మోత్కూరు మండలంలో పది గ్రామ పంచాయతీలకు గాను రెగ్యులర్ కార్యదర్శులు కేవలం ఐదుగురే ఉన్నారు. - 9లో

న్యూస్‌రీల్

నేడు శైలజారామయ్యర్ రాక

భువనగిరిటౌన్ : చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ మంగళవారం చౌటుప్పల్‌కు రానున్నారు. ఈ మేరకు చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పద్మవంశీ ఫంక్షన్ హాల్‌లో చేనేత కార్మికులతో ఏర్పాటు చేసే సదస్సులో ఆమె పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం కింద ప్రవేశపెట్టిన చేనేత పథకాలు, అందుకు సంబంధించిన మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

కేజీబీవీలో తనిఖీ

భువనగిరి: జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నరా, ఏఎన్ఎం అందుబాటులో ఉంటుందా, ఉపాధ్యాయుల కొరత ఏమైనా ఉందా.. అని తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచిగా చదువుకోవాలని పేర్కొన్నారు.

మహా శివుడికి బిల్వార్చన



శివాలయంలో స్పటిక లింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖ మండపంలోని స్పటికలింగానికి పూజలు చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

ఆలేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జయరాజారామ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్, ఇంగ్లిష్, తెలుగు, డైయిరీ సైన్స్ సబ్జెక్టులకు గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం, ఇతరులు 55శాతం మార్కులు ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈనెల 23వ తేదీ సాయంత్రం 3గంటల వరకు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

కొండగడప విద్యార్థినికి సన్మానం



సన్మానం పొందుతున్న పరిశోధక విద్యార్థిని స్వాతి

మోత్కూరు: మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థిని దొండ స్వాతి ప్రముఖ సాహితీవేత్తల నుంచి ప్రశంసలు అందుకుంది. స్వాతి చదువుతో పాటు విద్యార్థి దశనుంచే రచనలు, వ్యాసాలు రాస్తూ పేరుగడించారు. ఆమె రాసిన వ్యాసం చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ సూర్య ధనుంజయ్, ప్రసిద్ధ సాహితీవేత్త ముదిగొండ శివప్రసాద్, నలిమిల భాస్కర్, ఆట్టం దత్తయ్య వ్యాసాల సరసన చోటు దక్కడంతో ఆమెకు సత్కరించారు.ఆదివారం హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీ పటేల్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు స్వాతిని శాలువాతో సన్మానించి అభినందించారు.

పురస్కారం అందుకోవాలని చేనేత కార్మికులకు ఆహ్వానం

సంస్థాన్ నారాయణపురం: జాతీయ చేనేత అవార్డులకు ఎంపికైన చేనేత కళాకారులు పురస్కారం అందుకోవాలని చేనేత, జౌళి కేంద్ర మంత్రిత్వ శాఖ సోమవారం ఆహ్వానం పంపింది. యువ చేనేత విభాగంలో గూడ పవన్, మార్కెటింగ్ విభాగంలో గజం నర్మద అవార్డులకు ఎంపికయ్యారు. ఆగస్టు 7న చేనేత దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించే వేడుకల్లో రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాలు అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికైన ఇద్దరూ సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన కళాకారులు కావడం విశేషం.



ఉత్సవమూర్తులకు పుష్పార్చన చేసి హారతినిస్తున్న ప్రధానార్చకుడు

నృసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట: ఏకాదశి సందర్భంగా సోమవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖమండపంలోని ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, అర్చకులు వేద మంత్రాలతో శ్రీస్వామివారిని కొలుస్తూ తులసీ దళాలతో లక్ష పుష్పార్చన చేశారు. అంతకుముందు వేకువజామున సుప్రభాత సేవ, గర్భాలయంలో స్వయంభూలకు అభిషేకం, సహస్రనామార్చనలు చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకునిత్యకల్యాణ వేడుక, బ్రహ్మోత్సవం, వెండి జోడుసేవ ఊరేగింపు తదితర వేడుకలతో ఆలయం సందడిగా మారింది.

సీఎం ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలి

- కలెక్టర్ హనుమంతరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు

సాక్షి,యాదాద్రి : వర్షాలు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలు, ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలపై వారితో చర్చించారు. అనంతరం జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులతో కలెక్టర్ హనుమంతరావు రివ్యూ నిర్వహించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చెరువుల్లో నీటి నిల్వల సమాచారాన్ని రోజువారీగా తెలియజేయాలన్నారు. లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేయాలని, ప్రక్రియ ముగిసిన తరువాత వివరాలు సమర్పించాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలకు నియమించిన అధికారుల వివరాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, సివిల్ సప్లై అధికారి రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా రెండు రైల్వే ప్రాజెక్టులు

ఇప్పటికే ఎంఎంటీఎస్, తాజాగా రీజినల్ రింగ్ రైల్

- రింగ్ రైల్వే లైన్‌కు వేర్వేరు ప్రాంతాల నుంచి మూడు ప్రతిపాదనలు
- రీజినల్ రింగ్ రోడ్డు ఆవల నుంచి ప్రతిపాదన తెరపైకి
- ఏ గ్రామాల మీదుగా పోనుందోనని చర్చ
- భూములున్న రైతుల్లో గుబులు



సాక్షి, యాదాద్రి : జిల్లా మీదుగా కొత్తగా మరో రైల్వే లైన్ రానుంది. ఇప్పటికే ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు ఎంఎంటీఎస్ పొడిగింపునకు కేంద్రం అనుమతి ఇవ్వగా.. తాజాగా రీజినల్ రింగ్ రైల్‌ను ప్రతిపాదించింది. ఈ రెండు రైల్వే లైన్ల ద్వారా జిల్లాకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని పలువురు అభిప్రాయపడుతుండగా.. రైతుల్లో మాత్రం భూ సేకరణ గుబులు నెలకొంది.

మూడు రకాల ప్రతిపాదనలు

రీజినల్ రింగ్ రైల్వే లైన్ వల్ల జిల్లాలోని పలు ప్రాంతాలకు– హైదరాబాద్ మధ్యన మల్టిమోడల్ కనెక్టివిటీ పెరగనుందని, పరిశ్రమల అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, సత్వర రవాణా సౌకర్యం తదితర ప్రయోజనాలు చేకూరుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. నూతన రైల్వేస్టేషన్ల నిర్మాణం వల్ల వాణిజ్య, వ్యాపార రంగం కూడా అభివృద్ధి చెందుతుందని భావించింది. ఇందుకోసం తొలుత రీజినల్ రింగ్ రోడ్డు మధ్యనుంచి 8 మీటర్ల వైశాల్యంలో రింగ్ రైల్వే లైన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. దీని వల్ల భూసేకరణ సమస్య తప్పనుందని, రీజినల్ రింగ్ రోడ్డు కోసం సేకరించే భూములతోనే సరిపెట్టవచ్చని ప్రభుత్వం భావించింది. దీంతో పాటు రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా జిల్లాలోని తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాల మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి సైతం ప్రతిపాదనలు రూపొందించారు. ఇందులో ఏది ఫైనల్ కానుందో తెలియాల్సి ఉంది.

3 నుంచి 11 కి.మీ దూరం


తాజా ప్రతిపాదన ప్రకారం రీజినల్ రింగ్ రోడ్డు ఆవల 3నుంచి 11 కిలో మీటర్ల దూరం వరకు రింగ్ రేల్వై లైన్ అలైన్‌మెంట్ మారింది. యాదగిరిగుట్ట, వంగపల్లి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల పరిధి నుంచి ప్రతిపాదించారు. గెజిట్ రానప్పటికీ రైల్వే లైన్ ఎక్కడి నుంచి పోనుందోనన్న ఆయా ప్రాంతాల ప్రజల్లో చర్చ మొదలైంది. ఇప్పటికే తుర్కపల్లి, భువనగిరి, చౌటుప్పల్ కాలాలో రైతులు రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూములు ఇచ్చారు. కొత్తగా చేసిన ప్రతిపాదనతో ఆయా ప్రాంతాల్లో భూములున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎంఎంటీఎస్ భూ సేకరణ సర్వే పూర్తి

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగిస్తున్నారు. ఇందుకోసం కేంద్రం రూ.412 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఉన్న రైల్వే ట్రాక్ వెంట మరో ట్రాక్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం ఘట్కేసర్ నుంచి బీబీనగర్, భువనగిరి మండలాలు, రాయగిరి మీదుగా వంగపల్లి వరకు 39 కిలో మీటర్ల భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి సర్వే పూర్తయ్యింది. రైల్వే శాఖ భూములు ఉన్నచోట సమస్య లేకపోగా, కొన్ని చోట్ల ప్రైవేట్ భూములను సేకరించాల్సి ఉంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మూడు, నాలుగో రైల్వే లైన్ల కోసం భూ సేకరణకు రైల్వే అధికారులు సిద్ధం అయ్యారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. భూ సేకరణకు త్వరలో గెజిట్ నోటిఫికేషన్ రానుంది. దీంతో ఈ ప్రాంత రైతుల్లో ఆందోళన మొదలైంది. పగిడిపల్లి వద్ద గల నడికుడి, ఖాజీపేట ట్రాక్‌లను ఎలాంటి ఆటంకం లేకుండా దాటడానికి ఇక్కడ మెట్రో రైల్ మాదిరిగా ఎత్తయిన బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇందుకోసం ఇక్కడ అదనపు భూ సేకరణ చేయాల్సి ఉంది.

ఉపాధ్యాయుల సర్దుబాటు కొలిక్కి!

- తొలుత స్కూల్ అసిస్టెంట్ల కేటగిరీలో సర్దుబాటు
- కలెక్టర్ వద్దకు చేరిన జాబితా
- నేడు 44 మందికి ఉత్తర్వులు
- ఆ తరువాత ఎస్‌జీటీలకు..
- ఈ వారంలో ప్రక్రియ పూర్తి



పాఠశాలలు	715
విద్యార్థులు	41,404
ఎస్ఏలు	1,640
సర్దుబాటు	44
ఎస్‌జీటీలు	1,105
సర్దుబాటు	60-70

భువనగిరి: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను వేర్వేరు పాఠశాలల్లో సర్దుబాటు చేసేందుకు విద్యాశాఖ కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. నిబంధనల ప్రకారం తొలుత స్కూల్ కాంప్లెక్స్, తర్వాత మండలం, అనంతరం ఇతర మండలాల్లోకి సర్దుబాటు చేయనున్నారు. కాగా మంగళవారం 44 మంది స్కూల్ అసిస్టెంట్‌ల(ఎస్ఏ)కు ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

మొత్తం 2,745 మంది ఉపాధ్యాయులు

జిల్లాలో 715 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో గత ఆగస్టు నాటికి 35,558 మంది విద్యార్థులున్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ఈ విద్యా సంవత్సరం మరో 5,846 అడ్మిషన్లు పెరిగాయి. ఉపాధ్యాయుల విషయానికొస్తే ఎస్టీటీలు 1,105, ఎస్ఏలు 1,640 మంది విధులు నిర్వహిస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి పాఠశాలల పున:ప్రారంభంలోనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. బడిబాట కార్యక్రమం ముగిసిన తర్వాత విద్యార్థుల సంఖ్యపై స్పష్టత వస్తుందని, అందుకు అనుగుణంగా సర్దుబాటు చేస్తే బాగుటుందని ఉపాధ్యాయ సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సర్దుబాటు ప్రక్రియ వాయిదా పడిది. ఈ నెల 15వ తేదీనాటికి పూర్తి చేయాలని విద్యాశాఖ డీఈఓలను ఆదేశించింది. సర్దుబాటు ప్రక్రియ కొలిక్కి రావడంతో ఫైల్ కలెక్టర్‌కు చేరింది. కలెక్టర్ సంతకం చేస్తే మంగళవారం 44 మంది స్కూల్ అసిస్టెంట్లకు ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది. ఆ తరువాత 60 నుంచి 70 మంది వరకు ఎస్జీటీలను సర్దుబాటు చేసే అవకాశం ఉంది.

నిబంధనలకు అనుగుణంగా సర్దుబాటు

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ వారం రోజుల్లో పూర్తికానుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. వారినుంచి ఆదేశాల రాగానే సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ చేస్తాం. నిబంధనలకు అనుగుణంగా సర్దుబాటు చేస్తున్నాం.

–సత్యనారాయణ, డీఈఓ

సర్దుబాటు చేసిన చోటుకు వెళ్లేనా?

గత ఏడాది జూన్, జూలైలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను రెండు విడతలుగా చేపట్టారు. డీఎస్సీ–2024 ద్వారా కొత్తగా 252 మంది ఉపాధ్యాయులు వచ్చారు. అయినప్పటికీ ఉపాధ్యాయుల కొరత తీరలేదు. సమస్యను అధిగమించేందుకు వలంటీర్లను కూడా నియమించలేదు. దీంతో గత సెప్టెంబర్‌లో తాత్కాలికంగా ఉపాధ్యాయుల సర్దుబాటు జరిగింది. ఇందులో కొందరు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లగా.. మరికొందరు మంత్రుల, ఎమ్మెల్యేల పైరవీలతో యథాస్థానాల్లో కొనసాగారు. ప్రస్తుతం కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్న ఉపాధ్యాయులు మాత్రం సమీప మండలాల పాఠశాలల్లో సర్దుబాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పెన్షనర్ల సంఘం వార్షికోత్సవం సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో ఎన్నో ఏళ్లు సేవలందించడం, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో తోడ్పాటునదించడం అభినందనీయమన్నారు. ఎన్‌జీఓల ఇస్తున్న మాదిరిగా పెన్షనర్లకు కూడా హెల్త్‌కార్డులు ఇప్పిస్తానని, ప్రభుత్వనుంచి అన్ని రకాల బెనిఫిట్స్ వచ్చేలా చూస్తానన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి ఆలయ రిటైర్డ్ ఉద్యోగులతోపాటు అర్చకులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తానన్నారు. ఎమ్మెల్యేగా తన గెలుపులో భాగస్వాములైన పెన్షనర్లు, ప్రజలకు సేవకుడిగా ఉంటానన్నారు. పెన్షనర్లు వృద్ధాప్యంలో ఇబ్బంది పడకుండా సమావేశాలు నిర్వహించుకునేందుకు యాదగిరిగుట్ట పట్టణంలో ప్రత్యేకంగా భవనాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. పెన్షనర్లతో పాటు దేవస్థానం ఉద్యోగులు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, డిప్యూటీ ఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి కొక్కొండ యాదగిరి, ఉపాధ్యక్షులు కలకుంట్ల బాల్‌నర్సయ్య, హనుమంతరావు, రాష్ట్ర దేవాలయాల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంజనేయులు, రిటైర్డ్ ఏఈఓ వేముల రాంమోహన్, రిటైర్డ్ ప్రధానార్చకులు కారంపూడి నరసింహాచార్యులు, రంగాచార్యులు పాల్గొన్నారు.

నేడు ఎన్జీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు సిద్ధమైంది. కళాశాల స్థాపించి 69 సంవత్సరాలు పూర్తి చేసుకొని 70వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా మంగళవారం కళాశాలలో వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కళాశాల యాజమాన్యం పూర్తి చేసింది. ఉదయం 11 గంటలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వీరితో పాటు తెలంగాణ కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్లు డీఎస్ఆర్.రాజేంద్రసింగ్, పి.బాలభాస్కర్, రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్, కళాశాల పూర్వ విద్యార్థులు ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా 2021–2022 నుంచి 2023–2024 విద్యా సంవత్సరం వరకు వివిధ సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేయనున్నారు.

నీట మునిగిన పత్తి



సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. వర్షానికి ఆరెగూడెం పరిధిలోని మల్లారెడ్డి కుంటనిండి పత్తి చేలు నీట మునిగాయి. సుమారు 18 మంది రైతులకు చెందిన 40 ఎకరాల పత్తి చేలలోకి నీరు చేరింది.

నేతన్నకు ఆర్థిక భరోసా..

నేటి నుంచి ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

- 'నేతన్నకు భరోసా' పథకం కింద ఏటా రెండు విడతల్లో నగదు జమ
- ప్రధాన, అనుబంధ కార్మికుడికి ప్రోత్సాహం
- జిల్లాలో 13,542 మందికి ప్రయోజనం

భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికులకు ఆర్థిక చేయూత అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా నేతన్న భరోసా పథకం ద్వారా చేనేత, అనుబంధ కార్మికులకు ప్రోత్సాహం అందించనుంది. ఇందుకోసం మంగళవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు చేనేత జౌళిశాఖ అధికారులు దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తులను ప్రభుత్వానికి నివేదించిన అనంతరం మొదటి విడతగా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 6 నెలల మొత్తాన్ని సెప్టెంబర్ నెలాఖరు వరకు కార్మికుల ఖాతాలో డీబీటీ ద్వారా నేరుగా జమ చేయనుంది.

జియోట్యాగింగ్ మగ్గాలు 6,771

జిల్లాలో 6,771 జియోట్యాగింగ్ కల్గిన మగ్గాలు ఉన్నాయి. కాగా నేతన్న భరోసా పథకం మగ్గం నేసే కార్మికుడితో పాటు రంగులద్దే, వార్పు, చిటికికట్టే, నూలువడికే ఏదో ఒక అనుబంధంగా పనిచేసే కార్మికుడు కూడా అర్హుడే. మగ్గం నేసే కార్మికుడికి ఏడాదికి ప్రభుత్వం రూ.18వేలు, అనుబంధ కార్మికుడికి రూ.6వేల చొప్పున ప్రభుత్వం నగదు అందజేస్తుంది.ఈ లెక్కన మగ్గం నేసేవారు, అనుబంధ కార్మికుడితో కలుపుకొని జిల్లాలో 13,542 మంది కార్మికులకు రూ.16.25 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలుగనుంది. ఈ మొత్తం ప్రభుత్వం ప్రతి ఆరునెలల ఒకకసారి జమ చేయనుంది.

సడలిన నిబంధనలు

నేతన్న భరోసా కింద చేనేత కార్మికుడు ఏడాదికి 8 నుంచి 10 వార్పులు అనగా 42 చీరల నుంచి 70 చీరలు నేయాల్సి ఉంది. ముందుగానే కార్మికులు ఒప్పంద పత్రం కూడా రాసి ఇవ్వాలి. అయితే ప్రభుత్వం విధించిన నిబంధన చేనేత కార్మికులకు గుదిబండగా మారడంతో చేనేత వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.ఇటీవల భువనగిరిలో నిర్వహించిన నేతన్న భరోసా అవగాహన సదస్సులో నిబంధనలను సడలించాలని నేతన్నలంతా నినదించారు.అంతేకాక సమస్యను చేనేతజౌళిశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో అధికారులు కార్మికుల అభ్యర్థను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతం కనిష్టం 4 వార్పుల నుంచి గరిష్టంగా 8 వార్పులకు తగ్గించారు.



రెండు ఫారాలు నింపాలి

నేతన్నకు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకునే కార్మికలు రెండు ఫారాలి నింపాల్సి ఉంటుంది. ఇందులో ఫారమ్–ఏలో మగ్గం నేసే కార్మికుడి, అనుబంధ కార్మికుడి వివరాలు, ఫారమ్ –బీలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన తెలంగాణ హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ లోగోకు సంబంధించి కార్మికుడు తాము తయారు చేసే చీరె, వస్త్రం వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. అదేవిధంగా మగ్గం నేసే కార్మికుడి, అనుబంధ కార్మికులిద్దరి ఆధార్‌కార్డులు, ఆధార్‌కు లింక్ చేయబడిన బ్యాంకు ఖాతాను వివరాలను జతపర్చాలి.

సద్వినియోగం చేసుకోవాలి

మంగళవారం నుంచి ఈ నెల 31 వరకు దరకాస్తులను స్వీకరిస్తారు.పారదర్శకత కోసం ఇతర జిల్లాల అధికారులను నియమించారు.ప్రతి కార్మికుడు ఫారమ్ ఏ, ఫారమ్ బీ రెండు ఫారాలను నింపి ఇవ్వాలి. అలాగే ఇద్దరి ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం జత చేయాల్సి ఉంటుంది. నేతన్నలకు ఎంతో ఉపయోగకరమైన ఈ పథకాన్ని కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలి.

–శ్రీనివాసరావు, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ

నాలుగు క్లస్టర్లు

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న చేనేత ప్రభావిత మండలాలను నాలుగు క్లస్టర్లుగా విభజించి అధికారులు నేత కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. అందులో ఒకటో క్లస్టర్‌లో భూదాన్‌పోచంపల్లి, రెండవ క్లస్టర్‌లో చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, మూడో క్లస్టర్‌లో భువనగిరి, వలిగొండ, రామన్నపేట, నాలుగో క్లస్టర్‌లో గుండాల, మోత్కూర్, ఆత్మకూర్(ఎం), మోటకొండూర్ మండలాలు ఉన్నాయి.

50 ఏళ్లుగా మగ్గం నేస్తున్నా



నా వయస్సు 63 సంవత్సరాలు. గత 50 ఏళ్లుగా మగ్గం నేసి జీవనం సాగిస్తున్నా. కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నా. దాంతో ఏడాదికి 5 నుంచి 6 వార్పుల కంటే ఎక్కువ నేయలేను. ఒక్కోసారి నూలు, వార్పు అందక ఆలస్యం అవుతుంది. కాబట్టి వార్పులను పరిగణలోకి తీసుకోకుండా జియోట్యాగింగ్ కల్గిన ప్రతిమగ్గం, అనుబంధ కార్మికులకు భరోసా ఇవ్వాలి

–కొక్కుల ఆయోధ్య, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

వార్పులను తగ్గించడం సంతోషం



నేతన్న భరోసాలో 8 నుంచి 10 వార్పులు నేయాలనే నిబంధన వల్ల వృద్ధాప్యంలో ఉన్న చేనేత కార్మికులు నేయలేరు. దాంతో చాలా మంది నష్టపోతారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులను కలిసి విన్నవించాం. అధికారులు కూడ సానుకూలంగా స్పందించి 4 నుంచి 8 వార్పులకు తగ్గించడం సంతోషం. జిల్లాలో నేతన్న భరోసా కింద రూ.16.25 కోట్ల ఆర్థిక ప్రయోజనం జరగనుంది. ఈ అవకాశాన్ని కార్మికులు వినియోగించుకోవాలి

–అంకం పాండు, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు, భూదాన్‌పోచంపల్లి

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రవీందర్ (ఫైల్)

మద్దిరాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం కుక్కడం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజగానితండాకు చెందిన లాకవత్ రవీందర్ బతుకుదెరువు కొరకు హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం హైదరాబాద్‌లోని అన్నోజిగూడలో బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హైదరాబాద్‌లోనే ఓ హాస్పిటల్‌లో చేర్పించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మనస్తాపంతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చింతపల్లి: భూ వివాదంలో అవతలి వ్యక్తులు అనే మాటలకు మనస్తాపం చెందిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చింతపల్లి మండలం వింజమూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బద్దవారిగూడెంలో సోమవారం జరిగింది. చింతపల్లి ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. బద్దవారిగూడెం గ్రామానికి చెందిన కడారి చంద్రయ్య(55) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నిరోజులుగా చంద్రయ్య కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి మధ్య పొలం పంచాయితీ జరుగుతుండగా.. ఆ వ్యక్తి అనే మాటలకు మనస్తాపం చెందిన చంద్రయ్య సోమవారం తన వ్యవసాయ పొలం వద్ద వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పాముకాటుతో గొర్రెల కాపరి మృతి

నడిగూడెం: పాముకాటుకు గురై గొర్రెల కాపరి మృతిచెందాడు. ఈ ఘటన నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ జి. అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ జిల్లా ఇడ్లీరు గ్రామానికి చెందిన సిద్ద నగేష్ (28) గొర్రెలను మేపుకుంటూ నడిగూడెం మండలానికి వలస వచ్చాడు. గత రెండు రోజులుగా నడిగూడెం మండలం రత్నవరం గ్రామ సమీపంలో శ్రీరంగాపురం గ్రామానికి చెందిన శేషగుప్తా వ్యవసాయ క్షేత్రంలో పెంట కోసం గొర్రెలను ఉంచాడు. సోమవారం తెల్లవారుజామున గొర్రెల వద్ద నిద్రిస్తున్న నగేష్‌ను పాము కాటు వేసింది. అతడిని కోదాడకు తరలించగా.. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గరుడ టికెట్‌తో శీఘ్ర దర్శనం

- తిరుమల శ్రీవాణి ట్రస్టు తరహాలో యాదగిరిగుట్టలో ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు
- ఒక్కో టికెట్ ధర రూ.5వేలు


యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించేలా ఆలయాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళ రూ.300 టికెట్‌తో బ్రేక్ దర్శనం పేరిట ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నారు. ఇదే మాదిరిగా ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారిని అంతరాలయంలో దర్శించుకునే విధంగా గరుడ టికెట్‌ను త్వరలోనే ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తిరుమల శ్రీవాణి ట్రస్టు తరహాలో..

తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రస్తుతం భక్తులకు శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10,500 టికెట్‌ను అందిస్తున్నారు. ఇదే తరహాలో యాదగిరిగుట్టలో సైతం ఒక్కో భక్తుడికి రూ.5,000తో గరుడ టికెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే ప్రముఖులు, ఎన్‌ఆర్‌ఐలు, విదేశీయులతో పాటు సామాన్య భక్తులు సైతం క్యూలైన్లలో గంటల తరబడి నిల్చునేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ గరుడ టికెట్‌ను ప్రవేశపెడితే తొందరగా, సులవుగా దర్శనం కావడంతో పాటు దేవాలయానికి ఆదాయం సైతం పెరగనుంది. ఈ టికెట్ కొనుగోలు చేసే భక్తులకు 5 అభిషేకం లడ్డూలు, కిలో పులిహోర ప్రసాదాన్ని సైతం అందజేయనున్నారు. అంతేకాకుండా ఆశీర్వచనం సైతం చేయనున్నారు. గరుడ టికెట్ కొనుగోలు చేసిన భక్తులు ఉదయం ఆలయం తెరిచినప్పటి నుంచి రాత్రి వరకు ఎప్పుడైనా అంతరాలయంలో స్వామివారిని దర్శించుకోవచ్చు.

వ్రత టికెట్ల ధర పెంపు..

యాదగిరిగుట్ట ఆలయంలో భక్తులు సత్యనారాయణస్వామి వ్రతం జరిపించేందుకుగాను ప్రస్తుతం టికెట్ ధర రూ.800 ఉండగా.. దానిని రూ.1,000కి పెంచుతూ ఆలయ ఈఓ వెంకట్రావ్ ఇటీవల నిర్ణయించారు. ఈ రూ.1000 టికెట్ కొనుగోలు చేస్తే.. ప్రస్తుతం సత్యనారాయణ వ్రతం జరిపించడానికి ఆలయం తరఫున భక్తులకు అందజేస్తున్న వ్రత సామగ్రితో పాటు స్వామివారి ప్రతిమ, శెల్లా, కనుమను అదనంగా ఇవ్వనున్నారు. ప్రతి రోజు వ్రత మండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు బ్యాచ్‌ల్లో 350 నుంచి 450 వ్రతాలు జరుగుతాయి. ఆదివారాలు, సెలవు రోజుల్లో మరో 100 వ్రతాలు అదనం. ప్రస్తుతం రూ.800 టిక్కెట్‌తో రోజుకు రూ.3లక్షల వరకు ఆదాయం వస్తుండగా.. రూ.1000కి ధర పెంచడంతో అదనంగా మరో రూ.90వేలు రోజుకు ఆదాయం అదనంగా రానుంది.

ఉచితాలతో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

- పనిచేసే కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదు
- అధికార, ప్రతిపక్షాలు వాడే భాష మార్చుకోవాలి
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ: ప్రభుత్వాలు ఇస్తున్న ఉచితాల వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పనిచేసే కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదన్నారు. ప్రజలు ఉచితాల పథకాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. దేశంలో వ్యవసాయమే ప్రధానమైందని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పని వైపు ప్రజలను మళ్లించి ఉచితాలను తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎన్నికల్లో విచ్చలవిడి ఖర్చే అవినీతికి మూలం

దేశంలో అవినీతి పేరుకుపోయిందనే వాదన ఉంది. ఎన్నికల్లో విచ్చలవిడిగా పార్టీలు వేల కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నాయి. ఆ తర్వాత ఖర్చు పెట్టిన డబ్బును సంపాదించడానికి అవినీతికి పాల్పడుతున్నారు. దీనిని నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు, ఎన్నికల కమిషన్ చొరవచూపాలి. రాజకీయ నాయకులే కాదు.. కొందరు అధికారులు కూడా అవినీతికి పాల్పడుతున్నారు. ఇంజనీరింగ్ శాఖలో ఇష్టమొచ్చినట్లు ఎస్టిమేట్ వేసి అక్రమాలకు పాల్పడుతున్నారు.

నాయకుల భాష మారాలి

రాజకీయ నాయకులు మాట్లాడే భాష మార్చుకోవాల్సిన అవసరం ఉంది. వారు వాడే భాషతో భవిష్యత్ తరాలకు ఏం మెసేజ్ ఇస్తున్నారనేది ఆలోచించాలి. రాజకీయ నాయకులంటే ఇప్పటికే ప్రజలు ఈసడించుకుంటున్నారు. రాజకీయ నాయకులు గౌరవంగా మాట్లాడాలి. బనకచర్లను ముఖ్యమంత్రి వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర ఒప్పందం ప్రకారమే చేసుకోవాలి. ఎమ్మెల్సీలు మల్లన్న, కవిత ఫిర్యాదులపై రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తారన్నారు. పెద్దల సభను గౌరవించాల్సిన అవసరం అందరికి ఉంది. దూషణలు, దాడులు సరికావన్నారు. సాగర్ ఎడమ కాల్వకు ముందే నీటి విడుదల చేయడం వల్ల రైతులు ఆనందంగా ఉన్నారన్నారు.

ఒకే ప్రదేశంలో రెండు రోడ్డు ప్రమాదాలు

- లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- అదే ప్రదేశంలో మరో ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన డీసీఎం
- ఓ ప్రయాణికుడు మృతి
- బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- నార్కట్‌పల్లి మండల కేంద్రం సమీపంలోని నల్లగొండ బైపాస్ రోడ్డు వద్ద ఘటన

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై నార్కట్‌పల్లి మండల కేంద్రం సమీపంలోని నల్లగొండ బైపాస్ వద్ద సోమవారం ఒకే ప్రదేశంలో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనలో ఓ ప్రయాణికుడు మృతిచెందగా.. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న స్టార్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ సోమారం తెల్లవారుజామున నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై నార్కట్‌పల్లి మండల కేంద్రం సమీపంలోని నల్లగొండ బైపాస్ రోడ్డు వద్ద హోటల్ ముందు ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన కొద్దిసేపటికి గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న అదే స్టార్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు డ్రైవర్ రోడ్డు పక్కన బస్సు ఆపి.. తమ కంపెనీ చెందిన బస్సు ప్రమాదానికి గురికావడంతో వివరాలు తెలుసుకునేందుకు రోడ్డు అవతలి వైపు వెళ్లాడు. ఈ క్రమంలో ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి డీసీఎం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన గుదిబండి వెంకట్‌రెడ్డి(84) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో 10మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించారు. వెంకట్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

సంస్థాన్ నారాయణపురం: ఎదురుగా వస్తున్న డీసీఎంను తప్పించబోయి ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ అటవీ ప్రాంతంలోని కడిలబావితండాలో సోమవారం జరిగింది. పోలీసులు, తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం పీపుల్ పహాడ్ గ్రామానికి చెందిన దండుగుల రంజిత్ (32) కంప్రెషర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కంప్రెషర్ పని నిమిత్తం ట్రాక్టర్‌ను తీసుకొని సోమవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి వెళ్తుండగా.. రాచకొండ ప్రాంతంలో కడీలబావితండా పరిధిలో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎంను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న గుంతలో ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో రంజిత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగన్ తెలిపారు రంజిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బోరు బండి పైనుంచి పడి..


కుర్ర సందీప్

రామగిరి(నల్లగొండ): బోరు బండి పైనుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన నల్ల గొండ మున్సిపాలిటీ పరిధిలోని చంద్రగిరి విలాస్‌లో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన అనిల్ కకాడియా బోర్ బండి మీద కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చంద్రగిరి విలాస్‌లో బోర్ వేసిన అనంతరం ఒంటిపై ఉన్న దుమ్మును శుభ్రం చేసుకునే క్రమంలో విశాల్ వర్కాడే అనే వ్యక్తి ఎయిర్ పైపును అనిల్ కకాడియా వెనుక నుంచి పెట్టగా అతడు ప్రమాదవశాత్తు బోర్ బండి పైనుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అనిల్ కకాడియాను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అన్ను వార్కడే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

కన్నం వేసి.. కొల్లగొట్టారు

సూర్యాపేటలో బంగారం షాపులో భారీ దొంగతనంతో కలకలం

- విషయం తెలియడంతో ఉలిక్కిపడ్డ పట్టణ వ్యాపారులు
- ఉమ్మడి జిల్లాలో ఇంత పెద్దదొంగతనం ఇదే..
- చర్చనీయాంశంగా మారిన భారీ చోరీ
- కోట్లు విలువ చేసే బంగారం అపహరించిన దుండగులు


దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న సూర్యాపేట ఎస్పీ నరసింహ


లాకర్ రూంకు ఉన్న షెటర్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన దొంగలు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జ్యువెలరీ షాపులో ఆదివారం రాత్రి జరిగిన భారీ దోపిడీ కలకలం రేపింది. దొంగలు జ్యువెలరీ షాపునకు కన్నం వేసి 8కిలోల బంగారం చోరీచేయడంతో బంగారం షాపు నిర్వాహకులతో పాటు పట్టణంలో ఇతర వ్యాపారులు ఉలిక్కిపడ్డారు. సూర్యాపేట పట్టణంలో ప్రధాన రోడ్డు అయిన ఎంజీ రోడ్డులోని శ్రీసాయి సంతోషి జ్యువెలరీ షాపులో దొంగతనం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. గతంలో ఎప్పుడూ కూడా ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఇంత పెద్ద దొంగతనం జరగలేదు. 2011లో సూర్యాపేటలోని పూల సెంటర్ రోడ్డులో ఓ బంగారం షాపులో కిలో బంగారాన్ని అప్పట్లో దొంగలు ఎత్తుకుపోయారు. అప్పటి నుంచి అంత పెద్ద మొత్తంలో దొంగతనాలు జరగలేదు. తాజాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏకంగా ఎనిమిది కిలోల బంగారం చోరీకి గురికావడం కలకలం సృష్టించింది. భారీ దొంగతనం కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. జిల్లా కేంద్రంలో చాలా చోట్ల సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పనిచేయడం లేదు. రాత్రి వేళల్లో సైతం పోలీసులు పెట్రోలింగ్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కొత్త షాపు పెట్టేందుకు ఎక్కువ మొత్తంలో కొనుగోలు

సూర్యాపేటకు చెందిన తెడ్ల కిషోర్ పదమూడు సంవత్సరాలుగా బంగారం వ్యాపారం చేస్తున్నాడు. మొదటగా జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ రోడ్డులో బంగారం షాపు నిర్వహిస్తుండగా ఆ తర్వాత ఐదేళ్ల క్రితం షాపును ఎంజీ రోడ్డుకు మార్చాడు. ఎక్కువగా ముంబై, హైదరాబాద్ నుంచి బంగారం కొనుగోలు చేస్తుంటారు. అయితే, ఇటీవల మరో బంగారం షాపు పెట్టేందుకు భారీగా బంగారం కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. ఈ బంగారాన్ని షాపులోని లాకర్ రూంలో గల అల్మారాలో భద్రపరిచాడు. ప్రస్తుతం శ్రీసాయి జ్యువెలరీ షాపు నిర్వహిస్తున్న మడిగె అద్దెకు తీసుకున్నది. తాను సొంతంగా కొత్తగా భవనాన్ని నిర్మించాడు. వచ్చే నెలలో ఈ షాపును తన సొంత భవనంలోకి మార్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. కొత్త షాపులో పెట్టేందుకు సుమారు 16కిలోలకు పైగా బంగారం కొనుగోలు చేసినట్టు వ్యాపారి కిషోర్ చెబుతున్నాడు.

కొనుగోలు చేసిన రెండు వారాలకే చోరీ..

షాపు నిర్వాహకుడు కిషోర్ అధిక మొత్తంలో బంగారం కొనుగోలు చేసి తీసుకువచ్చి షాపులో పెట్టిన రెండు వారాలకే దొంగతనం జరగడం గమనార్హం. ఇది తెలిసిన వారి పనేనా అనే అనుమానం కలుగుతోంది.

పది రోజుల క్రితమే లాకర్ మార్పు..

ఇంతకాలం నడిపించిన షాపులో ఉన్న లాకర్‌ను పది రోజుల క్రితమే తన సొంత భవనంలో మార్చాడు. అయితే ఆ షాపు ఇంకా ఓపెన్ కాకపోవడంతో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసిన బంగారాన్ని షాపులోని లాకర్ గదిలో అల్మారాలను ఏర్పాటు చేసుకొని ఆ గదికి షెట్టర్ చేయించాడు. మరో పది రోజుల్లో షాపు మార్చాక బంగారం తీసుకెళ్దామనే భావనతో యజమాని ఉన్నాడు. ఇంతలోనే చోరీ జరగడంతో లబోదిబోమంటున్నాడు. బంగారం 16కిలోలకు పైగా ఉండగా అందులో ఎనిమిది కిలోల బంగారం, రూ.18లక్షల నగదును మాత్రమే ఎత్తుకెళ్లారు. వెండిని ముట్టుకోలేదు. అలాగే షాపులో నుంచి లాకర్ గదికి వచ్చే డోర్‌ను వెనుకాల నుంచి గడియ పెట్టి పరారయ్యారు.

కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు

చాలా కాలంగా బంగారం షాపు నిర్వహిస్తున్నప్పటికీ ఇలాంటి సంఘటన ఎప్పుడు జరగలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒక్కసారిగా పెద్ద మొత్తంలో బంగారం దొంగలు ఎత్తుకెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కొత్త షాపులోకి మంచి డిజైన్‌లతో కూడిన ఆభరణాలు, బంగారు బిస్కెట్‌లు తీసుకొస్తే వాటిని దొంగలు ఎత్తుకుపోవడంతో తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. దొంగతనం సమాచారం తెలిసిన ప్రజలు షాపు వద్దకు గుంపులు గుంపులుగా వచ్చారు. విలపిస్తున్న షాపు యజమానితో పాటు కుటుంబ సభ్యులను పలువురు ఓదార్చారు.


దొంగతనం జరగడంతో ఏడుస్తున్న యజమాని కుటుంబ సభ్యులు

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికులకు గాయాలు

వలిగొండ: వేర్వేరు చోట్ల తాటిచెట్టు పైనుంచి పడి ఇద్దరు గీత కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. వలిగొండ మండలం పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కళ్లెం నరసయ్య(50) సోమవారం గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. కాలు జారి కిందపడడంతో కాలు విరిగింది. గ్రామస్తులు గమనించి అతడిని వెంటనే చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడికి ఎక్స్‌గ్రేషియా అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మద్దెల రాజయ్య, గాజుల ఆంజనేయులు కోరారు. ప్రభుత్వం గీత కార్మికులకు సేఫ్టీ మోకులు, ప్రమాద బీమా అందజేయాలని అన్నారు.

మోకు జారి కిందపడి..

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు దేశగాని నరేష్ సోమవారం గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నరేష్‌ను కల్లుగీత కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు పరామర్శించి ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, బీసీ కార్పొరేషన్ నుంచి రూ.15వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి కృష్ణారెడ్డి, పాపయ్య, శ్రీనివాస్, ధనుంజయ్య, సతీష్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. వారి నుంచి రూ. 8,440 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ సైదులు తెలిపారు.

యువకుడి అదృశ్యం

మిర్యాలగూడ అర్బన్: స్నేహితుడి తీసుకురావడానికి బైక్‌పై బస్టాండ్‌కు బయల్దేరిన యువకుడు అదృశ్యమయ్యాడు. సోమవారం మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కుర్ర సందీప్‌కు ఈ నెల 19వ తేదీ రాత్రి 9గంటల సమయంలో తన స్నేహితుడైన షేక్ సమీర్ ఫోన్ చేశాడు. హైదరాబాద్ నుంచి తాను, తన తండ్రి జాన్ మహ్మద్ గోరె వస్తున్నామని.. ఎవరిదైనా బైక్ తీసుకుని మిర్యాలగూడ బస్టాండ్‌కు రమ్మని సందీప్‌కు చెప్పాడు. దీంతో సందీప్ తన ఇంటి పక్కనే ఉంటున్న గొని మధు బైక్ తీసుకుని మిర్యాలగూడ బస్టాండ్‌కు బయల్దేరాడు. కానీ అతడు బస్టాండ్‌కు వెళ్లకుండా కనిపించకుండాపోయాడు. ఎంత వెతికినా సందీప్ ఆచూకీ లభించకపోవడంతో సోమవారం అతడి తల్లి ఉమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూసీ ప్రాజెక్టుకు జలకళ

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుతుండటంతో జలకళ సంతరించుకుంది. మూసీ ఎగువన వర్షాలు కురుస్తుడటంతో ఆదివారం సాయంత్రం మూసీ ప్రాజెక్టుకు 880 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం ఉదయానికి ఒక్కసారిగా 2443 క్యూసెక్కులకు పెరిగింది. మూసీ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో ఇన్‌ఫ్లో రావటం ఈ ఏడాది ఇదే మొదటి సారి. వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 530 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

యాదగిరిగుట్ట దర్శనానికి వచ్చి..

- మహిళ అదృశ్యం

భువనగిరి: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన మహిళ భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామంలో అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని జీడిమెట్ల ప్రాంతంలోని గాజుల రామారానికి చెందిన గంధం త్రివేణి ఈ నెల 17న తన స్నేహితురాలు రమ్యతో కలిసి యాదగిరిగుట్టకు వెళ్తున్నట్లు ఇంట్లో భర్తతో చెప్పి బయల్దేరింది. కొంత సమయం తర్వాత భర్త శ్రీహరి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని త్రివేణిని అడగడంతో భువనగిరి మండలం వడాయిగూడెం వద్ద ఓ లాడ్జీలో ఉన్నట్లు చెప్పింది. సాయంత్రం వరకు ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో సోమవారం త్రివేణి తల్లి నాగేంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మహిళ వయస్సు 30 సంవత్సరాలు, 5 అడుగుల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు 87126 62472, 87126 62733 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రూ.20కే రూ. 2లక్షల బీమా

- ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనతో భవిష్యత్తుకు భరోసానిస్తున్న కేంద్ర ప్రభుత్వం


భువనగిరిలో పీఎంఎస్‌బీవై పోస్టర్ ఆవిష్కరిస్తున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం లక్ష్మిశ్రావ్య తదితరులు

భువనగిరిటౌన్: కేంద్ర ప్రభుత్వం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై)ను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా సంవత్సరానికి రూ.20 కట్టడం ద్వారా రూ.2లక్షల బీమా పొందవచ్చు. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల మధ్య వయస్సు గల భారతీయ పౌరులు ఈ బీమాకు అర్హులు. అయితే ఇందు కోసం ఏదైనా బ్యాంకులో పొదుపు ఖాతా ఉండాలి. ఒకవేళ ఒకటి కంటే ఎక్కువ బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు ఉంటే.. ఏదైనా ఒక బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే ఈ పథకంలో చేరడానికి అవకాశం ఉంటుంది. ఉమ్మడి ఖాతా ఉంటే.. ఆ ఖాతాలో పేర్లు ఉన్నవారందరూ ఈ పథకంలో చేరడానికి అర్హులు అవుతారు. ఎన్‌ఆర్‌ఐలు కూడా ఈ పథకంలో చేరేందుకు అర్హులు. కానీ క్లెయిమ్ మాత్రం లబ్ధిదారుడికి లేదా నామినీకి భారత కరెన్సీలో చెల్లిస్తారు.

ప్రీమియం ఎంత చెల్లించాలి అంటే..

పీఎంఎస్‌బీవై పథకంలో వార్షిక ప్రీమియంగా కేవలం రూ.20 చెల్లిస్తే సరిపోతుంది. ప్రతి సంవత్సరం జూన్ 1వ తేదీ తర్వాత ఆటోమెటిక్‌గా బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియంను కట్ చేస్తారు. దీని కాలపరిమితి ఒక సంవత్సరం. ఏటా దీనిని పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. ఒకటి లేదా అంత కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాల ద్వారా ఈ పథకంలో చేరినట్లయితే.. క్లెయిమ్ సమయంలో కేవలం ఒక బ్యాంకు అకౌంట్‌కు మాత్రమే బీమా చెల్లిస్తారు. అంటే ఇతర బ్యాంకు అకౌంట్ల ద్వారా చెల్లించిన ప్రీమియాన్ని కోల్పోయినట్లే అవుతుంది. బీమా క్లెయిమ్ చేస్తే ప్రీమియం మారుతూ ఉంటుంది. ఎలాంటి క్లెయిమ్ చేయకపోతే మొదటి మూడేళ్లలో ప్రీమియంలో ఎలాంటి మార్పులు ఉండవు. బ్యాంకులు ఈ పాలసీకి సంబంధించిన ఎలాంటి పాలసీ సర్టిఫికెట్లు జారీ చేయవు.

బీమా వర్తించే సందర్భాలు..

సహజ విపత్తుల వల్ల జరిగిన ప్రమాదాల వల్ల మరణం లేదా వైకల్యం సంభవించినప్పుడు మాత్రమే ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం వర్తిస్తుంది. ఆత్మహత్య చేసుకున్న సందర్భాల్లో ఈ పథకం వర్తించదు. ఇలాంటి సందర్భాల్లో వారి కుటుంబానికి కూడా ఎలాంటి బీమా ప్రయోజనం లభించదు. ఒకవేళ చందాదారుడు హత్యకు గురైతే మాత్రం బీమా కవరేజ్ లభిస్తుంది. ప్రమాదవశాత్తు చందాదారుడు మరణిస్తే, మరణాన్ని ధ్రువీకరించడానికి సరైన పత్రాలను సాక్ష్యంగా చూపించాలి. అప్పుడు మాత్రమే పీఎంఎస్‌బీవై పథకం కింద క్లెయిమ్ మంజూరు అవుతుంది. ఒకవేళ రోడ్డు, రైలు, ఏదైనా వాహన ప్రమాదం, నీటిలో మునిగిపోవడం, హత్యకు గురికావడం లాంటి మరణాలు సంభవిస్తే.. వాటిని పోలీసుల ధ్రువీకరించాలి. అలాగే పాము కాటు, చెట్టుపై నుంచి కిందపడి చనిపోతే.. ఆ మరణాలను వైద్యులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. అప్పుడే మాత్రమే ఈ పథకం ద్వారా క్లెయిమ్ లభిస్తుంది. చందాదారుడు మరణించిన సందర్భంలో అభ్యర్థన నమోదు పత్రం ప్రకారం నామినీ క్లెయిమ్ కోసం దాఖలు చేయవచ్చు. ఒకవేళ నామినీ పేరును అభ్యర్థన నమోదు పత్రంలో తెలుపకపోతే అప్పుడు చందాదారుని చట్టపరమైన వారసుడు క్లెయిమ్ కోసం దాఖలు చేసుకోవచ్చు. మరణించిన వారి తరఫు క్లెయిమ్‌లు నామినీ, చట్టపరమైన వారసుల బ్యాంకు ఖాతాలో జమవుతాయి. అదే వైకల్యం తాలూకా క్లెయిమ్‌లు మాత్రం చందాదారుడి బ్యాంకు ఖాతాలో జమవుతాయి.

లబ్ధి పొందేది ఇలా..

ఈ బీమా పథకంలో చేరిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించినా లేదా పూర్తిగా అంగవైకల్యానికి గురైనా బాధిత కుటుంబానికి లేదా నామినీకి రూ.2,00,000 అందిస్తారు. ఒక వేళ పాలసీదారుడు పాక్షిక వైకల్యానికి గురైతే రూ.లక్ష పరిహారం అందిస్తారు. ప్రమాదంలో రెండు కళ్లు పూర్తిగా కోల్పోయినా లేదా రెండు చేతులు లేదా కాళ్లు కోల్పోయినా.. దానిని శాశ్వత వైకల్యంగా గుర్తించి రూ.2 లక్షలు పరిహారంగా అందిస్తారు. ఒక కాలు లేదా ఒక చెయ్యి, ఒక కంటి చూపు కోల్పోతే మాత్రం దానిని పాక్షిక వైకల్యంగా గుర్తించి రూ.లక్ష రూపాయలు పరిహారంగా ఇస్తారు.